వార్త

శీలసంపదను పెంపొందించలేని విద్య పరిమళం లేని పువ్వు వంటిది. ఆ విద్య నిరర్థకం, అనర్థకం

- గాంధీజీ

బుధవారం 9, డిసెంబర్ 2009

మనకు పట్టని తేడాలు

అణుశక్తి రంగంలో సహకారానికి సంబంధించి మనకు అమెరికాతో కుదిరిన 123 ఒప్పందానికి, సోమవారం నాడు రష్యాతో జరిగిన ఒప్పందానికి మధ్యగల తేడాలు ఏమిటో కొట్టవచ్చినట్లు కన్పిస్తున్నాయి. మనకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని, యంత్ర సామగ్రిని, ఇంధనాన్ని సరఫరా చేయటంలో అమెరికన్లు రకరకాల షరతులు విధించారు. ఇందుకు భిన్నంగా ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్, రష్యన్ అధ్యక్షుడు మెద్వెదేవ్ మధ్య జరిగిన ఒప్పందంలో షరతులు శూన్యం. వాస్తవానికి ఇండియాకు ఈ రెండు దేశాలతో వేర్వేరు రంగాలలోగల సంబంధాల చరిత్రను పరిశీలిస్తే, ఇదే పరిస్థితి అన్నింటా కన్పిస్తుంది. ఇదే అణుశక్తిసహకారాన్ని తీసుకున్నా గతంలో మన రియాక్టర్లకు అణుఇంధన సరఫరాను వారు అర్థంతరంగా నిలిపివేయటం, ఆ కారణంగా అనేక సంవత్సరాల పాటు సమస్యలు ఎదురవటం తెలిసిందే.

123 ఒప్పందాన్ని అనుసరించి మన అణు పరిశోధనలు, వినియోగాలు అమెరికా కనుసన్నలలో మాత్రమే సాగాలి. పేరుకు అంతర్జాతీయ అణు ఇంధనసంస్థ (ఐఎఇఎ) రంగంలో కనిపించినా వెనుక నుంచి తతంగమంతా నడిపేది అమెరికా అన్నది రహస్యంకాదు. ఇది ఇటీవలి కాలంలోనే ఇరాక్ సమస్యపై తిరుగులేనివిధంగా రుజువైంది. ఇరాక్‌లో అణ్వాయుధాల ఉత్పత్తి రహస్యంగా జరుగుతున్నదేమో శోధించేందుకు అమెరికన్లు ఐఎఇఎ, ఐక్యరాజ్యసమితి ద్వారా బృందాలను నియమింపచేసి వాటిలో తమ ఏజెంట్లను ఏ విధంగా చొప్పించారో తర్వాత బహిర్గతమైంది. అంతేకాదు. అక్కడ మారణాయుధాల జాడలు ఎంతమాత్రం లేవని హాన్స్‌బ్లిక్స్ బృందం స్పష్టం చేసినప్పటికీ అక్రమంగా దాడులకు పాల్పడ్డారు. ఇదంతా హాన్స్‌బ్లిక్స్ స్వయంగా చెప్పిన విషయమే. అదే పద్ధతిలో అమెరికన్లు మనపై యుద్ధం సాగించగలరనటంలేదు. కాని అంతర్జాతీయ సంస్థల తనిఖీల పేరిట ఆ పని చేసేది అమెరికన్లేనన్న వాస్తవాన్ని గ్రహించటం అవసరం. మనం వారికి ఇంతటి మిత్రులంగదా, వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం చేసుకున్నాంగదా, మన ప్రస్తుత నాయకత్వం వారికి ఎంతో సన్నిహితంగా వ్యవహరిస్తున్నదిగదా, అటువంటి స్థితిలో ఎటువంటి సమస్యలూ ఎప్పటికీ ఉండబోవని భావించటం మాత్రం భ్రమ అవుతుందని గుర్తించాలి. ఎక్కడిదాకానో అక్కరలేదు. 123 ఒప్పందమే అందుకు తార్కాణం. మనం తమకు అంతటి సన్నిహిత మిత్రులమే అయితే రకరకాల షరతులు ఎందుకు విధించినట్లు? షరతులు లేని దీర్ఘకాలిక సహకారం రష్యాకు సాధ్యమైనపుడు అమెరికాకు ఎందువల్ల ఆమోదయోగ్యం కాకపోవాలి?

123 ఒప్పందం కింద షరతులు ఉండటమేకాదు. వాటిలో దేనిని భారతదేశం ఉల్లంఘించినట్లు అమెరికా భావించినా వెంటనే ఒప్పందం నిలిచిపోవటమేగాక, అంతవరకు తాము సరఫరా చేసిన సాంకేతిక పరిజ్ఞానాన్ని, యంత్రపరికరాలను, వినియోగించకుండా మిగిలిన ఇంధనాన్ని వెనుకకు తీసుకునే అధికారం ఉంటుంది. అంతేకాదు. అదే విధంగా ఇతర అణుదేశాలు కూడా వ్యవహరించాలని వారు రాజకీయంగా ప్రయత్నిస్తారు. భారత్-అమెరికాల మధ్య ఇటువంటి పరిస్థితులు ఏర్పడవచ్చునా అనే సందేహం కలగవచ్చు. ప్రస్తుతం పరస్పర సంబంధాలు "గొప్పగా" ఉన్నందున, భవిష్యత్తులోనూ ఉభయులు "వ్యూహాత్మక సాన్నిహిత్యం"తో మెలగాలని భావిస్తున్నందున, ఇటువంటిది జరగకపోవచ్చుననే సాధారణ అభిప్రాయం ఒకటుంది. అది నిజమే కావచ్చు కూడా. కాని అనూహ్యమైన పరిణామాలు సంభవించవనే హామీ కూడాలేదు. అసలు అటువంటిది జరిగినా జరగకున్నా, కాగితంపై అయినా ఈ తరహా షరతులు ఎందుకు ఉండాలన్నది ప్రశ్న. షరతులేమీ లేకుండా రష్యన్లు సహకరించగలిగినపుడు అమెరికన్లు ఆ పని ఎందుకు చేయలేరు?

ఎన్‌పిటిపై సంతకాలు చేయని దేశాలకు అణు సాంకేతిక పరిజ్ఞానాలు, పరికరాల బదిలీని నియంత్రిస్తూ తీర్మానించిన జి-8లో రష్యాకు సభ్యత్వం ఉంది. అయినప్పటికీ తాము దానిని పాటించబోమని రష్యన్ అధికారులు సోమవారం స్పష్టం చేయటం గమనించదగ్గది. షరతులు విధించకపోవటమేగాక, ఇండియా భవిష్యత్తులో అణు ఇంధనాలు, పరిజ్ఞానాల వినియోగంపై పూర్తి స్వేచ్ఛలను కూడా ఈ ఒప్పందం కల్పిస్తున్నది. విచిత్రమేమంటే ఇటువంటి స్పష్టమైన తేడాలు కన్పిస్తున్నప్పటికీ మన పాలకులకు అమెరికా పరమ ప్రేమాస్పదంగా, విశ్వసనీయంగా తోస్తుంటుంది.

ప్రజల ఆగ్రహ ఫలితం బాబ్రీ మసీదు కూల్చివేత కాగా, ఆ సంఘటనపై జస్టిస్ ఎంఎస్ లిబర్హాన్ నివేదిక అంతా తప్పుల తడకే.

■ బిజెపి అధ్యక్షుడు రాజ్‌నాథ్‌సింగ్

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెడితే తెలుగుదేశం పార్టీ తరపున సంపూర్ణ మద్దతు ఇస్తాం.

■ తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు



ప్రజావాక్కు

అణు ఒప్పందం హర్షణీయం

మన ప్రధాని మన్మోహన్‌సింగ్ రష్యా పర్యటన సందర్భంగా పౌర అణు ఒప్పందం కుదురనుండటం హర్షణీయం. లోగడ అమెరికాతో కూడా అణు ఒప్పదం చేసుకున్నాం. కానీ ఈ అణు ఒప్పందంపై పలు విమర్శలు వచ్చాయి. అయితే రష్యాతో ప్రతిపాదిత ఒప్పదంలో షరతులు మనకు లాభించేవిగా ఉండటంతో ప్రతిపక్షాల నుంచి పెద్దగా విమర్శలు వచ్చే అవకాశం లేదు. రష్యాతో కుదుర్చుకున్న అణు ఒప్పందంపై వామపక్షాలు కూడా సానుకూల ధోరణి ప్రదర్శించే అవకాశం ఉంది. అణు ఇంధనాన్ని రీప్రాసెసింగ్ చేసుకునే హక్కు మనకు లభించడం వంటి అనుకూల అంశాలు గల ఈ ఒప్పదం కుదుర్చుకోవడం ద్వారా మన దేశ అణుకార్యక్రమాలు ఊపందుకోవడంతో పాటు అమెరికాపై పూర్తిగా ఆధారపడాల్సిన అగత్యం ఏర్పడదు. రష్యాతో మనకు అనాదిగాగల సత్సంబంధాలు పునరుద్ధరణకు కృషి జరగాలి.

● బి మోహన్,
తణుకు, ప.గో.జిల్లా

అభివృద్ధికి చేయూత

రాష్ట్రవ్యాప్తంగా సుమారు రెండు లక్షల మందికి పైగా ఐటిఐ పూర్తి చేసి నిరుద్యోగులుగా ఉన్నారు. ప్రస్తుతం వీరికి చేయూతనివ్వటానికి స్వయం ఉపాధి పథకాలను ప్రోత్సహించాల్సి ఉంది. అంటే వీరి నిరుద్యోగితను తగ్గించాలంటే చిన్న/కుటీర పరిశ్రమలను స్థాపించాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలోని వివిధ బ్యాంకులు స్వయంఉపాధి శిక్షణ పొందిన వారికి రుణాలు మంజూరు చేయాలి. ఎందుకంటే అప్రెంటిషిప్ చేసినా ఏ ఉపాధి దొరకక వీరు కూలీ పనులకు వెళ్ళాల్సిన అగత్యం ఏర్పడుతోంది. అందువల్ల ఐటిఐ నిరుద్యోగులు స్వంతంగా చిన్న పరిశ్రమలను నెలకొల్పుకునేందుకు కనీసం మూడు లక్షల రూపాయలు చొప్పున ఆర్థిక సహాయం అందించాలి. అలాగే స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి (ఎస్‌ఎఫ్‌సి) 80% రాయితీని కూడా ఇస్తారు. బ్యాంకులు వీరికి రుణాలు సులభంగా అందించే ఏర్పాట్లు చేయాలి. అలాగే అప్రెంటిస్‌షిప్‌లో అవకాశం కల్పించాలి.

● తిప్పారపు యాదస్వామి,
హైదరాబాద్

గోవుతో గ్రామాభివృద్ధి

భారతదేశంలో ప్రాచీనకాలం నుంచి గోవుకు ప్రముఖ స్థానం ఉంది. తల్లి తర్వాత తల్లివంటి స్థానాన్ని మనం గోమాతకు ఇస్తాం.ఎందుకంటే గోమాత ప్రజలకు ఆ దిశలో సేవలు అందిస్తుంది. గోవు వ్యవసాయానికి మూలాధారం. గ్రామీణ ఆర్థికవ్యవస్థకు వెన్నెముక వంటిది. స్వదేశీగోసంతతికి చెందిన ఆవుపాలు, నెయ్యి, పెరుగు వైద్యపరంగా ఎంతో విలువైనది. రసాయనిక ఎరువుల వల్ల విషపూరిత మవుతున్న మన ఆహారం, నీరు, కూరగాయలు, పండ్ల ఇత్యాదులనుండి మనం సేంద్రియ ఎరువులవల్ల కాపాడబడతాం. గోమూత్రం, గోపేడ వినియోగం ద్వారా చేసే సేంద్రియ వ్యవసాయ విధానాలవల్ల రైతులు ఆర్థికంగా లాభపడతారు. గో ఆధారిత సేంద్రియ వ్యవసాయం ద్వారా కాలుష్యరహిత పర్యావరణం, ఆహార సమృద్ధి సాధ్యమవుతాయి. కనుక స్వదేశీ గోసంతతి అభివృద్ధికి ప్రజలందరూ ముందుకు రావాలి.

● చామంతి అనిల్,
మిరుదొడ్డి, మెదక్ జిల్లా

ప్రభుత్వ ఆజమాయిషీ

రాష్ట్ర ప్రభుత్వం ఒక వంక రాష్ట్రంలో గిరిజనాభివృద్ధిలో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నామంటూనే మరోవంక 2010-15 సంవత్సరాలలో గిరిజన సాధికారితకు నడుం బిగించింది. గిరిజనాభివృద్ధికి ప్రభుత్వం చేపట్టే ప్రణాళికలు మంచివే అయినా ఆశించిన ఫలితాలు రాకపోవడానికి అధికారుల, సిబ్బంది అలసత్వమే కారణంగా కనిపిస్తోంది. ఆదివాసుల జీవనోపాధి, పౌష్టికాహారం, విద్య, ముఖ్యంగా ఆరోగ్య పరిరక్షణలో ఘోరంగా విఫలమవడం గమనార్హం. ప్రభుత్వానికి ఏజెన్సీలో పనిచేసే సిబ్బందిపై సరైన అజమాయిషీ లేకపోవడమే కారణం. అందుకే అడవి బిడ్డలు ఆరోగ్య విషయంలో అభద్రతాభావంతో కొట్టుమిట్టాడుతున్నారు. రానున్న 50 సంవత్సరాలలో 60 లక్షల మంది గిరిపుత్రుల కొరకు ఒక ప్యాకేజీ ప్రారంభించాలనే ప్రభుత్వాశయం ఆహ్వానింపదగ్గదే. అయినా దానిని అమలుపరచడంలోనే చిక్కులున్నాయి. అందుకే ఈ ప్రాంతాల్లో ప్రభుత్వం ప్రత్యేక బృందాల పర్యవేక్షణ ఏర్పాటు చేయాలి. ఈ ఐదు సంవత్సరాలలో వారి ఆదాయ వనరులు పెంచాల్సి ఉంది. విద్య, ఉద్యోగావకాశాలు ఇనుమడించాలి. మంచి వైద్యసేవలు అందేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. ఐటిడిఎ పరిధిలో భూరక్షణ విభాగాన్ని ఏర్పాటుచేసి వారు భూబకాసురుల బారిన పడకుండా కఠిన చర్యలు చేపట్టాలి. గిరిజన తండాలుండే ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి. 500 మంది గిరిపుత్రులు ఉన్న గ్రామాన్ని పంచాయితీగా ప్రకటించడమేగాదు, ఈ వ్యవస్థను సమర్థవంతంగా అమలుజరిగేట్లు అవగాహన కల్పించాలి. గిరిజన ప్రాంతాల అధికారులు, సిబ్బందిపై ప్రభుత్వ అజమాయిషీ ఉండాలి. లేకుంటే ఎన్ని ప్యాకేజీలు ఇచ్చినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంటుంది.

● వి నాగసూర్యుడు,
చేబ్రోలు, తూ.గో.జిల్లా

e mail: editpage@vaartha.com

'ప్రత్యేక' ఉద్యమం: హక్కుల దృక్పథం

ప్రొ॥ జి.హరగోపాల్

గత మూడు నాలుగు దశాబ్దాలుగా తెలంగాణ ప్రాంతంలో ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష నలుగుతున్నది. రాష్ట్రం ఏర్పడేప్పుడే తెలంగాణ ప్రాంతప్రజలకు కొన్ని అనుమానాలు, భయాలు ఉన్నాయి. అది పెద్ద మనుషుల ఒప్పందాన్ని చూస్తే స్పష్టంగా అర్థమవుతుంది. తెలంగాణ ప్రాంత శాసనసభ్యులతో కూడిన ప్రాంతీయ కమిటీని నియమించి, తెలంగాణ బడ్జెట్, నిధుల సమీకరణ వనరుల వినియోగం దాని పరిధిలోకి వస్తాయనేకాక, తెలంగాణలో భూముల కొనుగోలుకు ఈ కమిటి అంగీకారం అవసరం అని కూడా పేర్కొన్నారు. ఇక ముల్కీ నిబంధనల గురించి వేరే చెప్పనవసరంలేదు. ఇలాగ నిధులు, నియామకాలు భూముల లావాదేవీలు తెలంగాణ ప్రజల అకాంక్షమేరకే జరుగుతాయన్న ఒప్పందం అప్పటి సందర్భాన్ని, భయాలనేకాక, రాజకీయ పరిష్కారమార్గాన్ని కూడా సూచిస్తున్నాయి. ఈరోజు హైదరాబాద్‌లోని అవకాశాల మీద జరుగుతున్న చర్చ, రాష్ట్ర రాజధాని హైదరాబాద్ ఎందుకు ఫ్రీజోన్‌గా ఉండకూడదని వాదించే వారికి చరిత్ర తెలియకపోవడం, ఒప్పందంపట్ల నిర్లక్ష్యం, ఉల్లంఘన, వక్రీకరణ ఎంతదాకా వచ్చాయంటే హైదరాబాద్ మీద తెలంగాణ ప్రజలకు ఏమైనా హక్కులు ఉన్నాయా, ఉంటాయా, ఉండాలా అనే చర్చదాకా వచ్చాయి.

రెండో తరగతి నాయకత్వం

హైదరాబాద్ తెలంగాణ ప్రజలు నాలుగు వందల ఏళ్ళుగా అభివృద్ధి చేసుకున్న నగరం. తెలంగాణ ప్రజల శ్రమ ఈ నగర నిర్మాణంలో కీలకమని గుర్తించాలి. అప్పుడే మొత్తం రాష్ట్రానికి ముఖ్య పట్టణమైనప్పుడు ఇతర ప్రాంతాల వాళ్ళకు నగరంలో హక్కులు ఉండవా అనే ప్రశ్న అడిగి మిగతా ప్రాంత ప్రజలు తమ ముఖ్య పట్టణంలో రెండవ తరగతి పౌరులుగా ఉండాలా అంటున్నారు. అంటే మరి అన్నిప్రాంతాల ప్రజలని నగర అభివృద్ధిలో, అవకాశాలలో న్యాయబద్ధమైన భాగస్వామ్యం ఉంటుందా ఉండదా అనే ప్రశ్న కూడా అడగాలి. అభివృద్ధి చెందిన ముఖ్యంగా కోస్తా నాయకత్వానికున్న రాజకీయ చతురత, అధికారంమీద పట్టు వెనకబడిన ప్రాంతాల నాయకులకుండదు. దానికి ప్రత్యక్ష సాక్ష్యం ఇప్పుడున్న తెలంగాణ నాయకత్వం. హైదరాబాదులో ఇతర ప్రాంతంవాళ్ళు రెండవ తరగతి పౌరలని అనుకుంటే, మొత్తం రాష్ట్రంలో తెలంగాణ ప్రజలు ముఖ్యంగా నాయకత్వం రెండవ తరగతి నాయకత్వమేనని స్పష్టంగా కనిపిస్తున్నది. తెలంగాణకు అన్యాయం జరుగుతున్నా నిలదీసి అడగలేని నాయకత్వం, తమ స్వప్రయోజనాల్లో నెరవేరితే సంతృప్తిపడే సంకుచిత నాయకత్వం తెలంగాణ ప్రాంతానిది. నిజానికి అభివృద్ధి చెందిన ప్రాంత నాయకులకు వెనుకబడిన ప్రాంతాలపట్ల ఒక న్యాయభావన, సమభావన లేనప్పుడు వెనుకబడిన ప్రాంత ప్రజలకు జరగవలసినంత న్యాయంజరగదని, ఈ ప్రాంతాలు అభివృద్ధి చెందిన ప్రాంతాల ఆక్రమణకు దోపిడీకి గురౌతున్నది కూడా ఒక మౌలిక సత్యం.

హైదరాబాద్ నగరం విశాలాంధ్రకు ముఖ్యపట్టణం అయిన తర్వాత వేగంగా అభివృద్ధి చెందినదన్నది నిర్వివాదాంశం. ఆ అభివృద్ధిలో ఎవరి వాటా ఎంత, ఇందులో కేంద్ర ప్రభుత్వము, ఇతర రాష్ట్రాలనుంచి వచ్చిన పెట్టుబడి, గత ఒకటిన్నర దశాబ్దాలుగా ప్రపంచబ్యాంకు పెత్తనం ఇలా చాలా కారణాలున్నాయి. హైదరాబాద్ నగరం ఇంత అభివృద్ధి చెందింది అన్న వెలుగుకు ఈ నగరం చుట్టూ ఉన్న మెదక్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల చీకటి చూస్తే కాని అర్థంకాదు. గత శతాబ్దంలో 50, 60 దశాబ్దాలలో వచ్చిన ఇలాంటి అభివృద్ధి నుండి లాటిన్ అమెరికన్ సామాజిక శాస్త్రవేత్తలు సెంటర్ - పెరిఫరీ అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. అంటే ఒక ప్రాంతం వేగంగా అభివృద్ధి అవుతున్నదంటే ఇంకెక్కడో మరో ప్రాంతం చాలా వెనుకబడిఉంటుంది. ఆ వెనుకబడిన ప్రాంతాల వనరులను కొల్లగొట్టకుండా మరొక ప్రాంతం అభివృద్ధి సాధ్యం కాదని వాళ్ళు ప్రతిపాదించారు.

ఈ అభివృద్ధి నమూనా నిరంతర అసమానతలను దారి వేయటమేకాక అసమానతలు పెరిగిపోతుంటాయి. ఇలాంటి అసమతుల్య అభివృద్ధి తిరుగుబాటులకు, విప్లవ పోరాటాలకు అస్తిత్వ భావజాల ఆధారిత ఉద్యమాలకు కారణమౌతుంది. ఇది ఇంకాముందుకుపోయి స్వయంనిర్ణయాధికారహక్కుకు (రైట్ ఉ సెల్ఫ్ డెటిర్మినేషన్) కోరుకుంటుంది. తెలంగాణ ప్రత్యేకరాష్ట్ర ఆకాంక్షను ఆ నేపథ్యంలో అర్థంచేసుకుంటే తప్ప ఎందుకు ఇన్నిసంవత్సరాలు ఈ ఉద్యమం సజీవంగా ఉందో మనకు అర్థం కాదు.

సరైన అవగాహనలేని పాలకులు

అయితే ఈ నేపథ్యం నుండి వచ్చే ఉద్యమాలపట్ల పాలకులకు ప్రజాస్వామ్య అవగాహన ఉండదు. దోపిడీ మనస్తత్వం దళారీ దృక్పథమున్న పాలకులకు ప్రజాస్వామ్యంపట్ల గౌరవం గాని విశ్వాసంగాని ఉండవు. ఈ వర్గం తన దోపిడీకి బలప్రయోగంమీద ఆధారపడి పనిచేస్తుంది. పెట్టుబడిదారీ వ్యవస్థ బలప్రయోగాన్ని కొన్ని ప్రజాస్వామ్య నియమాలకు, నిబంధనలకు కట్టుబడి ఉపయోగిస్తుంది. కాని చాలా వెనకబడిన దేశాల ప్రభుత్వాలు సైన్యంమీద, నియంతృత్వం మీద, పోలీసుల మీద, అసాంఘిక శక్తుమీద అధారపడి వాళ్ళ ద్వారా ప్రజలను నియంత్రిస్తుంటారు. ఇలాంటి పరిపాలనకు మనదేశం, ముఖ్యంగా మన రాష్ట్రం చక్కటి ఉదాహరణ. రాష్ట్ర ప్రగతి చాలా వేగంగా సాగుతున్నదని ఒకవైపు ప్రకటిస్తూ, పోలీసుల సాయుధ దళాల అధికారాన్ని పెంచుతూవచ్చారు. నక్సలైట్ ఉద్యమాన్ని అణచటం పేరమీద ఇచ్చిన విచ్చలవిడి అధికారాలు చట్టబద్ద పాలనకు దాదాపు ముగింపు పలికాయి. పోలీసు అధికారులు కొందరు లాటిన్ అమెరికన్ నియంతలవలే తయారయ్యారు. నిజానికి వేగవంతమైన అభివృద్ధి నుండి ప్రజల జీవనం మెరుగుపడాలి. ప్రజలు తమ నిత్యజీవిత అవసరాలకు జీవన్మరణ పోరాటాలు చేయనవసరంలేదు. యువతకు పని చేయడానికి భిన్న అవకాశాలు, ప్రత్యామ్నాయాలుండాలి. నిజానికి నిజమైన అభివృద్ధికి ఇవే ప్రమాణాలు. మన రాష్ట్రంలో వచ్చిన అభివృద్ధి ఒక భ్రాంతే కాని అది వాస్తవ అభివృద్ధి కాదనడానికి రాష్ట్రంలో జరుగుతున్న ఉద్యమాలే ఒక రుజువు.

ఫలితం లేని శాంతియుత పోరాటం

ఇప్పుడు జరుగుతున్న తెలంగాణ ఉద్యమం గతం కంటే భిన్నంగా దాదాపు ఒక దశాబ్దకాలం శాంతియుతంగానే కొనసాగింది. తెలంగాణ రాష్ట్రసమితి, ఏ కారణాలవల్లనైతేనేమి, శాంతియుత పోరాటాలవైపే మొగ్గింది. ఎన్నికలలో పోటీ చేసారు. పాలక పార్టీలతో పొత్తుపెట్టుకున్నారు. లాబీయింగ్ చేసారు. ఇవి ఏవీ ఫలితాలనివ్వలేదు. ఈ పద్ధతులు పని చేయవని తెలంగాణలోని కొందరు ప్రజాస్వామ్యవాదులు, ప్రజాసంఘాలు అంటూనే ఉన్నాయి. శాంతియుతంగానైనా ప్రజల ప్రత్యక్షపాత్రతో ఉద్యమాలు కూడ సమాంతరంగా ఉండాలనే బలమైన వాదన ఒకటి సజీవంగా ఉంది. శాంతియుత వాదన, ఒత్తిడి ఏవీ పనిచేయలేదు. దీనితో విసిగిన ప్రజలు ఉద్యమ ఆకాంక్ష వ్యక్తీకరిస్తున్న తరుణంలో తెలంగాణ రాష్ట్ర సమితికి కూడ ఉద్యమబాట తప్పలేదు. అయితే ఉద్యమానికి పూర్తి సంసిద్ధత రాకముందే విద్యార్థులు, భిన్న సామాజిక వర్గాలు, సామాన్య ప్రజలు అనూహ్యంగా స్పందించారు. ఉద్యమాల అవసరాన్ని గుర్తించిన వాళ్ళకు కూడా ఆశ్చర్యం కలిగించే రీతిలో ప్రజాస్పందన వచ్చింది. అయితే రాజశేఖర్‌రెడ్డి మరణం వలన రాజకీయ వ్యవస్థ కొంత ప్రజాస్వామ్యయుతంగా, ఒక పదిరోజుల 'వెసులుబాటు' కలిగించింది. ముఖ్యమంత్రి, హోం మంత్రి ఇలాంటి ఉద్యమాన్ని ఎలా తట్టుకోవాలని ఆలోచిస్తున్న క్రమంలోనే పెట్టుబడి, దోపిడీ స్వభావం, దళారీ వ్యవస్థ ప్రభుత్వాలు ఇలాంటిఉద్యమాలను అణచాలనే ఒత్తిడి పెంచాయి. ముఖ్యమంత్రి అయినా, హోంమంత్రి అయినా బలమైన ప్రజాస్వామ్య విశ్వాసాలున్న వాళ్ళని భావించడంకష్టం వాళ్ళిద్దరూ అణచి వేయగలమా లేదా అన్న అనుమానం ఉన్నవారు. రాజశేఖర్‌రెడ్డి లేదా చంద్రబాబు లాంటి వాళ్ళు ఈ పదిరోజులు కూడా నడవనిచ్చేవారా లేదా అన్నది అనుమానాస్పదమే.

ఒక పదిరోజుల శాంతియుత ఉద్యమంలో తెలంగాణ ప్రజల ముఖ్యంగా విద్యార్థుల, వృత్తిసంఘాల, మధ్యతరగతి ప్రజల సృజనాత్మక ప్రయోగాలను చూశాం. చెదురుమదురు సంఘటనలు మినహాయించి ఉద్యమాన్ని దగ్గరగా చూసినవారికి ప్రజాస్వామ్య పద్ధతులు ఒక కొత్త అనుభూతిని కలిగించాయి. వ్యవస్థలో శాంతియుత పద్ధతులకు ఎంత అవకాశముందో పూర్తిగా చూడకముందే, డిసెంబర్ 7న అణచివేత యంత్రాంగం ఈ ప్రక్రియకు అడ్డుపడింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థులమీద అమానుషమైన లాఠీచార్జీ, చితకబాదడం, పక్కనేఉన్న మాణికేశ్వరినగర్ ప్రజలమీద, కుటుంబాలమీద, జర్నలిస్టులమీద, ప్రజాప్రతినిధుల మీద దౌర్జన్యంచూస్తే ఈ వ్యవస్థ ఎంత కఠినంగా మారిందో అర్థమవుతున్నది.

గౌరవం లేని పోలీసు వ్యవస్థ

రాష్ట్రంలో గత నాలుగు దశాబ్దాలుగా పోలీసు యంత్రాంగానికి విపరీత అధికారాలు కల్పించి వాళ్ళకు చట్టమంటే తెలియని స్థితికి తీసుకొచ్చారు. కొందరు పోలీసు అధికారులకు రాజ్యాంగంపట్ల ప్రజాప్రతినిధులపట్ల, మీడియాపట్ల విశ్వవిద్యాలయాలపట్ల, చివరికి న్యాయవ్యవస్థపట్ల కూడా గౌరవంలేదు. ఇవన్నీ ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదులు. వీటిని వేటిని లెక్కచేయకపోవడం వలన సామాజిక సంక్షోభ భారం తమమీదే వేసుకొని తాము తప్పించి ఇక ఎవరూ వ్యవస్థ నిర్వహణకు అవసరంలేదనే ఒక అపనమ్మకానికి వాళ్ళు వచ్చారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలోకి వెళ్ళేముందు విసిని అడగాలని వాళ్ళకు తోచదు. రాష్ట్ర మానవహక్కుల సంఘం విశ్వవిద్యాలయంలోకి వెళ్ళకూడదని ఆజ్ఞలు జారీచేసినా ఖాతరు ఉండదు. వీటన్నింటిని గౌరవించడం వలన తమ భారం తగ్గుతుందని అనుకునే బదులు, ఉద్యమాన్ని ఎదుర్కొనే భారమంతా తమదే అన్నట్లు లాఠీలు, తుపాకులు పట్టుకుని ప్రజాస్వామ్య శవయాత్రకు కారణమౌతున్నారు.

అణచివేతకు కారణం

పౌరహక్కుల ఉద్యమం గత నాలుగు దశాబ్దాలుగా అలసట లేకుండా ప్రజాస్వామ్యహక్కుల గురించి ఉద్యమాలు చేస్తున్నది. ఆరుమంది పౌరహక్కుల నాయకులను పోగొట్టుకున్నది. బాలగోపాల్ లాంటి అద్భుత మేధావి తన ఆరోగ్యం పాడు చేసుకుని ఈ పని చేసాడు. ఇంతకాలంగా హక్కుల సంఘాలు చెపుతున్న ఒకే ఒకమాట నక్సలైట్ ఉద్యమ అణచివేత పేర పోలీసులకు ఇస్తున్న విస్తృతాధికారాలు, అణచివేత పద్ధతులు అవి నక్సలైట్ ఉద్యమానికే పరిమితం కావు. అవి పౌర సమాజంలో ఉండే అన్ని ప్రజాస్వామ్య రూపాలకు విస్తరిస్తాయి. ఈ సంస్కృతి శాంతియుత ఉద్యమాలను కూడా చేయనివ్వవు అనే మాట పదేపదే చెబుతూ వస్తున్నాయి. ఈ పద్ధతులన్నీ వ్యవస్థను ప్రశ్నిస్తు ఉద్యమానికే కాదు వ్యవస్థ లోపటి నిరసన ఉద్యమాలకు కూడా విస్తరిస్తాయి. ఇది చాలా ప్రమాదం అని చెప్పుతూనే ఉన్నాయి.

ఇలా అణచివేత విధానాలు ప్రయోగించటానికి ప్రధాన కారణం ఈ అభివృద్ధి నమూనాకి, వ్యవస్థకు ప్రజాస్వామ్యంగా పాలించగలమన్న విశ్వాసం లేకపోవడమే. ఈ అభద్రత అభివృద్ధి చెందిన ప్రాంత సంపన్నులకు ఇంకా ఎక్కువుంటుంది. ఈ అభద్రతే ఇపుడు తెలంగాణ ప్రాంత ప్రజల ఆకాంక్ష మీద కొనసాగుతున్న అణచివేతకు కారణం. అయితే ఇపుడు జరుగుతున్న ఉద్యమంలో నుండి కొన్ని ప్రజాస్వామ్య విలువలు పౌర సమాజ చైతన్యంలో పొదిగి, మరింత విస్తృతమైన హక్కుల ఉద్యమానికి దోహదపడతాయనే ఒక బలమైన విశ్వాసం కలుగుతున్నది. ❑

ఇప్పుడిది ఉమ్మడి ఉద్యమం

ప్రొ॥ దండెబోయిన రవీందర్

(నిన్నటి తరువాయి)

తదనంతర పరిణామాలలో భాగంగా వైఎస్ దుర్మరణం చెందడం రోశయ్య ముఖ్యమంత్రి కావడం, కాంగ్రెస్‌లో గ్రూపు రాజకీయాలు చాలా ప్రస్ఫుటంగా బయటపడటం జరిగింది. తెలంగాణకున్న ఏకైక అడ్డంకి వైఎస్ లేకపోవడం కాంగ్రెస్ బలహీనంగా ఉండటం, గత ఎన్నికలలో దిగజారిన పరిస్థితి నుండి బలమైనశక్తిగా తెరాస ఎదగడానికి సరైన రాజకీయ వాతావరణం అని భావించి కెసిఆర్ ఆమరణ నిరాహార దీక్షాయుధాన్ని ప్రయోగించడం జరిగింది.

తెలంగాణ సాధనకు కేవలం రాజకీయ ప్రక్రియ సరిపోదు, నిరంతర పోరాటాలు, ఉద్యమాలు రెండు జోడిస్తే తెలంగాణ సాధ్యమవుతుందని ముందునుండి వివిధ ప్రజాసంఘాలు వాదిస్తున్నా పట్టించుకోలేదు. ఏది ఏమైనా 'తెలంగాణ' అంశాన్ని ఎత్తాలన్నా, దించాలన్నా కెసిఆర్‌కే చెల్లింది. ప్రజాబాహుళ్యం కలిగిన ఏకైక రాజకీయ పార్టీగా తెలంగాణ వచ్చుడో, కెసిఆర్ చచ్చుడో అనే నినాదంతో చివరి అస్త్రాన్ని ప్రయోగించి రాజకీయ చర్చకు అవకాశం కల్పించాడు. ఎంతో కాలంగా అదునుకోసం చూస్తున్న ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు, సాంస్కృతిక సంఘాలు ఈ ఆమరణదీక్షతో ఒక్కటైనప్పటికి విస్తృత ప్రాతిపదికన ఉద్యమం విస్తరించబడింది. ఆమరణ దీక్ష కేంద్రబిందువు అయినా, ఉద్యమం ఇప్పుడు టిఆర్‌ఎస్ ఒక్కరి చేతిలో కాకుండా ఉద్యోగ, విద్యార్థి, ప్రజాసంఘాల నాయకత్వం పెద్దఎత్తున ముందుకొచ్చింది.

ఈ నేపథ్యంలో వివిధ ఉద్యమాలకు నిలయమైన ఉస్మానియా విశ్వవిద్యాలయం ఈ ఉద్యమానికి కూడా అశేష సంఖ్యలో విద్యార్థుల నాయకత్వంలో ముందుకు దూసుకుపోతుంది. 1969లో వచ్చిన తెలంగాణ ఉద్యమాన్ని పోలి ఉందని వివిధ కథనాలు వస్తున్నాయి. కాని ఒక తేడా ఉంది. 1969లో వచ్చిన ఉద్యమం 'ఆవేశపూరిత' ఉద్యమం ప్రస్తుతం కొనసాగుతున్న ఉద్యమం 'ఆలోచనల హేతుబద్ద ఉద్యమం' వివిధ సంఘాలలో పనిచేస్తున్న విద్యార్థి నాయకులు సిద్ధాంతపరంగా, సమస్యల పరంగా విభేదాలున్నా 'తెలంగాణ సాధనే' ఏకైక లక్ష్యంగా జాయింట్ యాక్షన్ కమిటి ఏర్పడి దిశానిర్దేశాలు చేస్తుంది.

ఈ క్రమంలోనే కాకతీయ, శాతవాహన, తెలంగాణ పాలమూరు విశ్వవిద్యాలయాలలోని విద్యార్థి, విద్యార్థినులు గాంధేయ మార్గంలో శాంతియుతంగా ఉద్యమం కొనసాగించడం వివిధ ప్రజాసంఘాలు వీరికి మద్దతుపలకడం, వీరి నేతృత్వంలో ముందకు పోవడం మంచి పరిణామం. వివిధ రాజకీయ పార్టీలకు రకరకాల కోరికలు ఉంటాయి. ఉద్యమాల నుండి లబ్ధిపొందాలనే ఆలోచనలు ఉంటాయి. కాని విద్యార్థులు నిస్వార్థంగా, ఎలాంటి ప్రతిఫలాన్ని ఆశించకుండా చిత్తశుద్ధితో ముందుకు పోవడంవల్లే రాజ్యయంత్రాంగం ఖంగుతింటున్నది. కాంగ్రెస్ గత యాభై సంవత్సరాల నుండి మోసం చేస్తూ వస్తుందని, 1969లో వచ్చిన ఉద్యమాన్ని ఉక్కుపాదంతో అణిచి 360 మంది విద్యార్థులను బలిగొంది. ఆ త్యాగాలు ఊరికేపోవు, అలాంటి రాజ్యహింసకు తావులేకుండా శాంతియుతంగానే ఉద్యమం చేస్తున్నప్పటికిని పోలీసు యంత్రాంగం కవ్వింపు చర్యలు చేసినా నిగ్రహంతో ముందుకు నడిపిస్తున్నారు. అందుకే కాంగ్రెస్‌పార్టీ తెలంగాణకు అడ్డంకి అని అన్ని ప్రధాన రాజకీయ పక్షాలు వాదిస్తున్నాయి. ఈ నేపథ్యంతో కాంగ్రెసు కూడా వేచి చూస్తున్న విషయమేమంటే 'తెలంగాణ'కు టిఆర్‌ఎస్ ఏకైక ప్రతినిధికాదు, దాని గుత్తాధిపత్యం కాదు. ఆ క్రెడిట్ ఒక్క టిఆర్‌ఎస్‌కే చెందవద్దనే విధంగా ఉన్నట్లు కన్పిస్తున్నది. కాని ఇప్పుడు పరిస్థితి భిన్నంగా ఉంది. 'తెలంగాణ ఉద్యమం' ప్రజా ఉద్యమంగా మారంది. విద్యార్థి, ఉద్యోగ, ప్రజా సంఘాలు, సాంస్కృతిక సంఘాలు, వివిధ రాజకీయ పక్షాలు అన్నింటి మద్దతు తెలంగాణ ఏర్పాటుకు ఉద్యమిస్తున్నాయి. కాబట్టి ఏ పార్టీ అయితే హైదరాబాద్ రాష్ట్రాన్ని విలీనం చేసిందో అదే పార్టీ హైదరాబాద్ (తెలంగాణ) రాష్ట్రాన్ని పునరుద్దరించి ప్రజాగ్రహానికి గురికాకముందే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వాగ్దానాన్ని నిలబెట్టుకుంటే ప్రజావిజయంగా చరిత్రలో మిగిలిపోతుంది. ❑

పలుకుబడి

చెవులేం జెప్పిండు?

తెలిదేవర భానుమూర్తి

గాదినం విక్రమార్కుడు యాల్లపొద్దుగాల్లే నిద్ర లేసిండు.మొకం గడుక్కోని పేపర్ సద్వుకుంట గూసున్నడు. పెండ్లాం చాయ్ ఇస్తదేమోనని ఎదురుజూసిండు.గని గామె చాయ్ ఇయ్యలేదు.ఇగ దాంతోని నోరిడ్సి-

"జెర చాయ్ ఇస్తవా?" అని విక్రమార్కుడు అడిగిండు.

"ఇంట్ల శక్కరి ఒడ్సిపోయింది"అని గాని పెండ్లాం జెప్పింది.

"బంద్ జెయ్యబట్కె బజార్ల దుక్నాలు తెర్వలేదు.శక్కరి యాడికెల్లి గొన్కరావాలె.చాయ్‌లేకుంటె లేకపాయె.కోపు ఉడ్కనీల్లు ఇయ్యి" అని విక్రమార్కుడు అన్నడు.

అంబట్యాల్ల అయినంక గాడు గింత దిని మంచిగ బన్నడు. రాత్రి ఏడుగొట్టంగ నిద్రలేసిండు.కాల్లుచేతులు గడుక్కోని జల్దిజల్ది గింత దిన్నడు.తిన్నంక సైకిల్ దీస్కోని ఇంట్లకెల్లి ఎల్లిండు. సైకిల్ దొక్కుకుంట గాడు బొందలగడ్డ దిక్కుబోబట్టిండు. బొందల గడ్డ కాడ ఉన్న అర్రల బేతాలుడు ఉంటున్నడు.గాడు దినాం హోటల్ల బువ్వతింటడు. గని బంద్ జెయ్యబట్కె గా దినం కుద్దు గాడే బువ్వ వొండుకున్నడు. గింత దిన్నంక గాడు టివి జూస్కుంట గూసున్నడు. బంద్ జెయ్యబట్కె ఇయ్యాల్ల విక్రమార్కుడు వొస్తడో రాడో అని గాడు అనుకుంటుండంగనే సైకిల్ గంటి సప్పుడు ఇనబడ్డది. గంటి సప్పుడు ఇనంగనే బేతాలుడు ఇంట్ల కెల్లి ఇవుతలకు వొచ్చిండు. సైకిల్ రుకాయించిన విక్రమార్కున్ని జూసిండు.

"ఇయ్యాల్ల నువ్వు రావనుకున్న" అనుకుంట గాడు సైకిలెక్క గూసున్నడు.

బేతాలుడు గూసోంగనే విక్రమార్కుడు సైకిల్‌దొక్కబట్టిండు. గప్పుడు సైకిలెక్క గూసున్న బేతాలుడు-

"రాత్రనకుంట,సలి అనకుంట,ఎత్తు గడ్డలని సూడకుంట నన్ను గూసుండబెట్టుకోని సైకిల్ దొక్కుతవు.నీకు దమ్మురా వొచ్చు.నీ కాల్లు చేతులు గుంజొచ్చు. గవన్ని యాదిమర్సెతందుకు నీకొక నడుస్తున్న కత జెప్త ఇను.కెసిఆర్ బూక్‌హర్తాల్ షురువు జేసిండు.ఎవ్వరెంత జెప్పినా గాయిన బూక్‌హర్తాల్‌ను ఇడ్వలేదు.జై తెలంగాన అన్కుంట సదుకునే పోరగాల్లు గూడ దంగలకు దిగిండ్రు. రెండు దినాలు బంద్ జేసిండ్రు. బంద్ దినాలల్ల ఒక్క బస్సుగూడ నడ్వలేదు.ఒక్క దుక్నంను గూడ కులాయించలేదు. నల్లగొండ జిల్లల గుండ్లపల్లి అనేటి ఊరు ఉన్నది. గా ఊరోల్లు గూడ బంద్ జేసిండు.గాల్లు ఆకిట్ల సాన్పుసల్లుడు బంద్ జేసిండ్రు. తానం బంద్ జేసిండ్రు. వొంట వొండుడు బంద్ బెట్టిండ్రు.

"వొంటలు బంద్‌జేసి మీరుగూడ బూక్‌హర్తాల్ జేస్తున్నరా?" అని అడిగితె-

"తెలంగాన కోసం ఏమన్న జేస్తం" అని గాల్లు అన్నరు.

ముక్యమంత్రి రోశయ్య సిఎల్పి మీటింగ్ బెట్టిండు.

"తెలంగాన ఇస్తె బాగుంటది" అని కొందరు మంత్రులు అన్నరు.

"తెలంగాన సెప్రేట్ అయితె రాయలసీమను గూడ సెప్రేట్ జెయ్యాలె" అని కొంతమంది ఎమ్మెల్యేలు అన్నరు.

"ఆంద్రను గూడ సెప్రేట్ జెయ్యాలె" అని ఇంకొంత మంది అన్నరు.

"పట్నంను సెప్రేట్ జెయ్యాలె" అని కొంతమంది అన్నరు.

"తెలంగాన మీద ఏం జెయ్యాలె అని ఆలోచన జేసెతందుకు మీటింగ్ బెడ్తె రాష్ట్రంను నాలుగు పచ్చలు జెయ్యాలంటరేంది?" అని రోశయ్య అడిగిండు.

"మన చేత్ల ఏమున్నది. అంత సోనియగాంది చేత్ల ఉన్నది. తెలంగాన సంగతి గామెకే ఇడ్సిపెడ్దాం"అని శశిదర్‌రెడ్డి అన్నడు.

నిమ్స్‌ల బూక్‌హర్తాల్ జేస్తున్న కెసిఆర్‌ను జూసెతందుకు చెంద్రబాబు నాయుడు బోయిండు.గాయినను జూసి నిమ్స్‌దవకాన ముంగట ఉన్న టిఆర్‌ఎస్సోల్లు చెంద్రబాబు డౌన్‌డౌన్ అని లాసిగ ఒల్లిండ్రు. చెంద్రబాబు నిమ్స్‌లకు బోయి కెసిఆర్ చెవుల ఏందో జెప్పివొచ్చిండు.

"అన్నా!కెసిఆర్ చెవుల ఏం జెప్పినవే?" అని మోత్కుంపల్లి నర్సింలు అడిగినా గాయిన ఏం జెప్పలేదు.

ఇంతకు చెంద్రబాబు, కెసిఆర్ చెవుల ఏం జెప్పిండు.గీ సవాల్‌కు జవాబ్ ఎర్కుండి గూడ జెప్పకుంటివా అంటె నీ సైకిల్ బిరిక్ పేలైతది అని బేతాలుడు అన్నడు.

"ఇగ ముంగట నన్ను సూడంగనే చెంద్రబాబు జిందాబాద్ అని అనుమని మీ వోల్లకు జెప్పుండ్రి.బాబుకు జిందాబాద్ గొడ్తెనే తెలంగాన వొస్తదని గీ తీర్గ ముంగట్కిబోవచ్చని జెప్పుండ్రి అని కెసిఆర్ చెవుల జెప్పిండు" అని విక్రమార్కుడు జెప్పంగనే బేతాలుడు సైకిల్ దిగి బొందలగడ్డ దిక్కు ఉర్కిండు. ❑

క్విజ్ ప్రశ్న: దేశంలో కేసుల పరిష్కారానికి పడుతున్న 15 ఏళ్ల జాప్యాన్ని ఎన్నేళ్లకు కుదించాలని ప్రభుత్వం భావిస్తోంది? (జవాబు రేపు) ★ నిన్నటి ప్రశ్నకు జవాబు: సముద్ర దొంగల స్వర్గధామంగా భాసిల్లుతోన్న దేశం సోమాలియా.